

తుఫాన్‌తో ప్రాణనష్టం జరగకూడదు

మిచాంగ్ తుఫాన్‌తో ప్రాణనష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..



దివ్యాంగులకు సంక్షేమ సిరులు

దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. వారిలో ఆత్మస్థైర్యం నింపుతోంది. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కథనం. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
29/22

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిర్దేశించిన గడువులో రీ సర్వే పూర్తి చేయాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



రీసర్వేపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీ సర్వే నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడో విడత రీ సర్వేలో వీఎస్ లాగిన్ వరకు సకాలంలో 130 గ్రామాలు పూర్తి చేయడం అభినందనీయమని అధికారులను అభినందించారు. అదే స్ఫూర్తితో మిగిలిన ప్రక్రియ ఈ నెలలో పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వేలో వచ్చిన అర్జీలతో పాటు జేకేసీలో వచ్చిన అర్జీలు పరిష్కరించి ఈకేవైసీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. దీనిలో జిల్లా సర్వే అధికారి కిషోర్‌బాబు, పరిశీలకులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఫెన్సింగ్ జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో ఫెన్సింగ్ జిల్లా క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సబ్‌జూనియర్ (అండర్ 14), క్యాడెట్ (అండర్ 17) బాలబాలికల విభాగాల్లో ఈ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనదలచినవారు 2010 జనవరి 1వ తేదీ తరువాత, క్యాడెట్ విభాగంలో పాల్గొనదలచిన వారు 2007 జనవరి 1వ తేదీ మొదలు 2010 నవంబరు 30వతేదీ మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఈ పోటీలకు వచ్చే ఫెన్సింగ్ క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, సొంత ఫెన్సింగ్ కిట్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 7993790364, 7671991147 నెంబర్లను సంప్రదించగలరు.

ఐఎంఏ అధ్యక్షురాలిగా డాక్టర్ రూనీస్స



ఐఎంఏ నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న డా.నల్లూరి రాఘవులు, డా.జయశేఖర్



డాక్టర్ రూనీస్స

ఒంగోలు టౌన్: ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ రూనీస్స ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఐఎంఏ కార్యాలయంలో శనివారం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా డాక్టర్ ఈ.శ్రావణి, కోశాధికారిగా డాక్టర్ శ్రీదేవి ఎన్నికయ్యారు. సమన్వయకర్తగా డాక్టర్ జాలాది మణిబాబును ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలను ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ మన్నే వీరయ్య చౌదరి ప్రకటించారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ నల్లూరి రాఘవరావు, డాక్టర్ రావిపాటి జయశేఖర్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డా.రంగనాథ్ బాబు, డా.కోటిరెడ్డి పాల్గొన్నారు. కార్యవర్గంలో ప్రధాన పదవులకు మహిళలను ఎన్నుకోవడం విశేషం. ఈ ఎన్నికలు రాష్ట్రంలో ఎందరికో స్ఫూర్తినిస్తాయని పలువురు వైద్యులు పేర్కొన్నారు. నూతన కమిటీని నగరంలోని పలువురు వైద్యులు అభినందించారు.

మిచాంగ్ టెన్షన్



- ● లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు
- ● ఈ నెల 4, 5 తేదీల్లో పాఠశాలలకు సెలవులు
- ● ఉద్యోగులకు సెలవులు లేవని ప్రకటించిన కలెక్టర్
- ● రైతులు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- ● తీరప్రాంతంలో అలర్ట్
- ● నెల్లూరు, మచిలీపట్నం మధ్య 5వ తేదీ తీరం దాటే అవకాశం
- ● తీరందాటే సమయంలో గంటకు 90 నుంచి 105 కిలోమీటర్ల వేగంతో గాలులు
- ● అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేసిన కలెక్టర్ దినేష్ కుమార్
- ● ప్రత్యేక సెల్ ఏర్పాటు.. 1077 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాపై చూపనుంది. 5వ తేదీ నెల్లూరు– మచిలీపట్నంల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత వాసులను అలర్ట్ చేసింది. 4, 5 తేదీలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. శనివారం కలెక్టర్ దినేష్‌కుమార్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

ఒంగోలు అర్బన్:

మిచాంగ్ తుపాను హెచ్చరికలతో కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్త చర్యలకు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ప్రాణనష్టం జరగకుండా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పంటలు నష్టపోకుండా ఉండేలా రైతులను అప్రమత్తం చేస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో 2500 హెక్టార్లలో వరిపంట కోత దశకు రావడంతో నష్ట నివారణపై రైతులకు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఒకవేళ పంట నష్టం వాటిల్లితే తక్షణమే అంచనా వేసి బాధితులకు పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. పశునష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో జిల్లాలోని అన్నీ పాఠశాలలకు కలెక్టర్ సెలవులు ప్రకటించడంతో పాటు అధికారులు, ఉద్యోగులకు సెలవులు మంజూరు చేసేది లేదని స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 105 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. పొక్లెయినర్లు ఇతర అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధంగా ఉంచుకునే చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో దురదృష్టవశాత్తు ఎవరైనా నీటిలో ఉండిపోతే రక్షించేలా పడవలు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉంచారు. 4వ తేదీ అర్ధరాత్రి నుంచి 5వ తేదీ మధ్యాహ్నం వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండేలా ప్రజలకు తెలియజేస్తున్నారు. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 1077 నంబర్‌తో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



దర్శి, అద్దంకి రోడ్‌లో ముండ్లమూరు మండలంలో కోతకు వచ్చిన వరి

మిచాంగ్ తుపానును అన్నీ విధాలుగా ఎదుర్కొనేలా ప్రాణ, పశు నష్టం వాటిల్లకుండా ఉండేలా కలెక్టర్ దినేష్‌కుమార్ పక్కా ప్రణాళికలతో అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. నిరంతరం పర్యవేక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేసేలా జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశాలు నిర్వహిస్తూ వివరాలు తెలుసుకుంటున్నారు. ఆదివారం కొత్తపట్నం తీర ప్రాంతంలో కలెక్టర్ పర్యటించనున్నారు.

జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా మత్స్యశాఖతో శుక్రవారం రాత్రి నుంచే హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేశారు. మత్స్యకార గ్రామాల్లో స్థానిక పెద్దల సహకారంతో తుపాను తీవ్రతపై జాలర్లకు విస్తృతమైన అవగాహన కల్పించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. తుపాను తీరానికి సమీపంలోకి వచ్చే సమయంలో సముద్ర నీటి మట్టం సుమారు ఒకటిన్నర మీటరు పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాటు చేస్తున్నారు. తీరప్రాంత మండలాల్లో ఉన్న 27 తుపాను షెల్టర్లను వినియోగించుకునేలా చర్యలు ప్రారంభమయ్యాయి. తీరప్రాంత మండలాలతో పాటు సమీప మండలాల ప్రజలకు డిసెంబర్ నెలకు సంబంధించిన రేషన్ సరుకులు వెంటనే అందజేసేలా చర్యలు తీసుకున్నారు. తుపాను ఖర్చుల కోసం టీఆర్–27 కింద వినియోగించుకునేందుకు జిల్లాకు రూ.1 కోటి ప్రభుత్వం కేటాయించింది.

■ తుపాను వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా కలిగినా వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ ఎస్‌ఈ వీజీ సత్యనారాయణ జిల్లా విద్యుత్‌శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు సెలవులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ప్రజలకు పలు జాగ్రత్త సూచనలు చేశారు. వర్షం, గాలులు ఉన్న సమయంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు తాకకూడదన్నారు. రైతులు విద్యుత్ మోటర్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరెంటు తీగల కింద, స్తంభాల వద్ద నిలబడకూడదని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగినా ఇతర సమస్యలు తలెత్తినా 1912 నంబర్ కాని సంబంధిత లైన్‌మెన్, సబ్‌స్టేషన్‌కు తెలపాలని సూచించారు.

వ్యవసాయ శాఖ:

తుపాను హెచ్చరిక నేపథ్యంలో వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు వస్తే తక్షణమే యంత్రాల్లో కోసి సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని చెప్పారు. టార్పలిన్ పట్టలను అందుబాటులో పెట్టుకోవాలని కోరారు. పత్తి, మిరప, ఇతర పంటల్లో నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులకు రైతులకు తగిన సూచనలు చేయాలని కోరారు.

మత్స్యకారులూ జాగ్రత్త

జిల్లాలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోనికి వెళ్లవద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. బంగాళాఖాతంలో 900 కి.మీల దూరంలో కేంద్రీకృతమైందని, మూడు నుంచి 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సమాచారం అధికారికంగా అందిందని చెప్పారు. వేటకు వెళ్లిన వారు సముద్రంలో ఉంటే తక్షణమే బయటకు రావాలని కోరారు. బోట్స్, నెట్స్‌ను ఒడ్డుకు దూరంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌లు

ఒంగోలు	7382788433
కందుకూరు	9491052950
చీరాల	9440817597
అద్దంకి	9490611613
ఎస్.ఈ కార్యాలయం	9440817491

అర్హత ఉంటే సంక్షేమ పథకాలు గడప వద్దకే

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు తమకు అర్హత ఉంటే చాలని, వర్గాలు, రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం ఉండదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని గోళ్లవిడిపి గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్‌దారులకు ప్రతి నెల 1వ తేదీనే అందజేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. పింఛన్ పొందేందుకు కేవలం అర్హత మాత్రమే తమ ప్రభుత్వం చూస్తుందని, ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా అర్జీ దాఖలు చేసుకోవచ్చని చెప్పారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పచ్చ కండువా కప్పుకుంటేనే పింఛన్

గత టీడీపీ ప్రభుత్వ కాలంలో పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల ఇళ్ల చుట్టూ తిరగాలని, పచ్చ కండువా కప్పుకుంటేనే పింఛన్ మంజూరవుతుందని చెప్పేవారని ఆయన విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేదని కేవలం తమ ఇళ్లవద్దకు వచ్చే వలంటీర్లకు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని, సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకోవటానికి గతంలో మాదిరిగా దూర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడకుండా తమకు సమీపంలోనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశామని అన్నారు.

తక్షణ పరిష్కారం కోసమే గడప గడపకు..

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని, దీర్ఘ కాలంగా పడిఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించుకోవటానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం సీఎం ఆలోచన విధానానికి అద్దం పడుతుందని, ప్రతి శాసనసభ్యుడికి రూ.2 కోట్లు నిధులు కేటాయించడం వలన ప్రజలు ఏమి ఆశిస్తున్నారో ఆ పరిష్కారాలు చేసేందుకు ఉపయోగించే అవకాశం కలిగిందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కె.జయరావు, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏపీవో ఎం.శైలజ, ఏఈలు అల్లూరయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా గట్టి నిఘా



సమావేశంలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

ఒంగోలు టౌన్: గ్రామాల్లో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా సమాఖ్య సభ్యులు గట్టి నిఘా ఉంచాలని డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ సూచించారు. జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యల బలోపేతానికి సభ్యులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేసుకొని శుభ్రమైన మంచినీరు లభించేలా కమిటీలు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎస్‌ఎం ఆలీ అన్నారు. తొలుత జిల్లా సమాఖ్య సభ్యులతో చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ గోవిందమ్మ, డీపీఎం ఐబీ కృపారావు, ఏపీఎం ఐబీ గంటా శ్రీనివాసరావు, ఏపీఎం హెచ్‌డీ శేషు పాల్గొన్నారు.

5న హర్షిణి డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

ఒంగోలు టౌన్: ఈనెల 5వ తేదీ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.భరధ్వాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భగీరథ కెమికల్ కంపెనీలోని ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్, బీఎస్సీ కెమిస్ట్రీలో డిగ్రీ, ఎంఎస్సీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటుగా ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జిల్లా ఉపాధి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం సెప్టెంబర్ 2022 నుంచి ఏప్రిల్ 2023 వరకు దరఖాస్తు చేసుకొని ఎలాంటి రసీదు తీసుకోని అభ్యర్థులు ఉపాధి కార్యాలయంలో ఈనెల 30లోపు సంప్రదించాలన్నారు.

జనగళం



మా సొంతింటి కల నెరవేరింది



సొంతిల్లు కట్టుకోవాలని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మా కల నేటికి నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. కానీ పట్టా ఇవ్వలేదు. ఇంటి స్థలం చూపించలేదు. భార్య, ఇద్దరు పిల్లలతో కలసి గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉండే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంట స్థలం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నాం. చేసుకున్న మొదటి దఫానే ఇంటి స్థలం మంజూరు చేసి హౌసింగ్‌లో ఇల్లు కట్టుకోవడానికి శాంక్షన్ వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులకు అదనంగా మరికొంత నగదుతో మాకు నచ్చిన విధంగా ఇల్లు కట్టుకొని కొత్త ఇంట్లో ఉంటున్నాం.

– బచ్చలకూరి దేవదానం, చిన్నకంభం, కంభం మండలం

జగనన్న ఆదుకున్నారు



మేము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అనుకోకుండా మా ఆయన పొలం పనుల కోసం అప్పులు చేశాడు. కానీ అవి తీర్చలేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో జగనన్న ప్రభుత్వం రైతు ఆత్మహత్య పరిహారం కింద రూ.7 లక్షలు ఇచ్చింది. ఆ డబ్బులతో కొన్ని అప్పులు తీర్చి మిగిలిన డబ్బులతో మా అబ్బాయిని చదివించుకుంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. మా అబ్బాయికి అమ్మఒడి కూడా వస్తోంది. జగనన్న విద్యాకానుకను ఇచ్చారు. నాకు పింఛన్ రూ.3000 వస్తుంది. ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నాం.

– జి.సీతారాములమ్మ, ఉమ్మడివరం, పుల్లలచెరువు మండలం

ఈ ప్రభుత్వం ఎంతో ఆదుకుంది



నాకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఈ ప్రభుత్వం డయాలసిస్ రోగులకు రూ.10 వేల పింఛన్ ఇస్తోంది. గతంలో పింఛన్ వచ్చినా ఎక్కడికో వెళ్లి తెచ్చుకోవాలి. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 1వ తేదీనే గ్రామ వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చి వెళ్తుండడంతో చాలా శ్రమ తప్పింది. వారంలో మూడు సార్లు మా ఇంటి వద్దకే 108 వచ్చి డయాలసిస్ చేసి వెళ్తారు. పింఛన్ డబ్బు నాకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– కందురు మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడివరం, పుల్లలచెరువు మండలం

వైఎస్సార్ చేయూత, స్త్రీనిధి పథకాలతో ఆర్థికంగా స్థిరపడ్డా..



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఒక్కో సంవత్సరానికి రూ.18,750 ఇచ్చారు. దీనికి తోడు స్త్రీనిధి నుంచి రూ.71,250 లోను ఇచ్చారు. రూ.90 వేలతో రెండు పాడి గేదెలను కొనుగోలు చేశాను. ప్రతి రోజు పాలును కేంద్రానికి పోస్తాను. నెలకు ఆదాయం రావడంతో కొన్ని అప్పులు తీర్చాను. రెండు సంవత్సరాలు చేయూత రూ.37,500 రావడంతో మరో గేదెను కొనుగోలు చేశాను. వచ్చిన ఆదాయంతో లోనుకు వాయిదా కడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పిల్లలను కూడా చదివించుకుంటున్నా. వైఎస్సార్ చేయూత పథకం ఎంతో ఉపయోగపడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎస్‌కె సుల్తాన్‌బీ, అల్లూరు, కొత్తపట్నం మండలం

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం వద్ద అధికారులు

పొదిలి, పొదిలి రూరల్: మండలంలోని తలమళ్ళ నుంచి బొద్దికూరపాడు మార్గంలో అనధికారికంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ రాఘవరావు పట్టుకున్నట్లు పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ కె. డేవిడ్ తెలిపారు. తెల్లవారు జామున బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఆపి తనిఖీ చేసినట్లు చెప్పారు. 70 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పొదిలి ఎంఎస్ఎల్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. వాహన డ్రైవరు, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ దాడిలో విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీలు రాం నారాయణరెడ్డి, డేవిడ్ ఉన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్


అరెస్టయిన జూదరులు

హనుమంతునిపాడు: మండలంలోని పెద్దదాసళ్లపల్లి పొలాల్లో కోడిపందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,820 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని చెప్పారు.

లైంగిక దాడిగా కేసు నమోదు

- విలేకరుల సమావేశంలో ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి


మాట్లాడుతున్న ఒంగోలు డీఎస్పీ నారాయణ

సింగరాయకొండ: బింగినపల్లి పంచాయతీలోని గిరిజన కాలనీకి చెందిన మైనర్‌పై జరిగింది లైంగికదాడి యత్నం కాదని.. అది లైంగికదాడేనని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ధ్రువీకరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వివరించారు. శుక్రవారం తమ విచారణలో బాలిక.. తనపై మేడిద ప్రతాప్, మేడిద హరిబాబు, అల్లాడి వంశీ అనే ముగ్గురు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించడంతో ఆమేరకు నమోదు చేశామన్నారు. కానీ శనివారం బాలిక వచ్చి ఆ ముగ్గురు వ్యక్తులు తనపై లైంగిదాడి చేశారని తాను భయపడి ముందురోజు వాస్తవాన్ని సరిగా చెప్పలేక పోయాయని తెలిపిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు, లైంగికదాడి, కిడ్నాప్ కేసు, మైనర్‌కు సంబంధించిన కేసులన్నీ నమోదు చేశామని వివరించారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేశామని బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామని వివరించారు. కేసుపై తక్షణం స్పందించిన సీఐ దాచేపల్లి రంగనాథ్‌ను అభినందించారు.

దివ్యాంగులకు సంక్షేమ సిరులు

- పలు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లలో 1,899 మందికి రూ.2,84,76,300 మేర లబ్ధి
- నేడు దివ్యాంగుల దినోత్సవం


పొదిలిలో మోటార్ వాహనాన్ని అందుకుంటున్న దివ్యాంగులు (ఫైల్)


వికలాంగుల కేంద్రంలో మ్యూజికల్ చైర్స్ ఆడుకుంటున్న చిన్నారులు

ఒంగోలు సెంట్రల్, మార్కాపురం: దివ్యాంగుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లాలో లక్ష మంది వరకు వివిధ రకాల దివ్యాంగులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వారిలో ఆత్మస్థైర్యం నింపేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అవసరమైన ఉపకరణాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. బ్యాక్ లాక్ పోస్టుల భర్తీకి సైతం చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 36,310 మంది వివిధ రకాలు పెన్షన్‌లు అందుకుంటున్నారు. ప్రకాశం జిల్లా లో ఈ సంవత్సరంలో 193 మందికి రూ. 98,53,500 ఉపకరణాలు అందించారు. చదువులకు ఉపయోగపడేలా ల్యాప్ టాప్‌లు, బధిరులకు ఉపయోగపడేలా మొబైల్‌ఫోన్‌లు, వీల్ చైర్స్, అంధులకు చేతి కర్రలు, మూడు చక్రాల మోటార్ వాహనాలు ఇచ్చారు.

ఎన్నో కార్యక్రమాలు..

- ✔ దివ్యాంగుల ఉద్యోగాల విషయంలో గతంలో 3 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచారు.
- ✔ క్రీడల్లో దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు.
- ✔ గతంలో బస్‌పాసుల కాలపరిమితి ఒక సంవత్సరం ఉండగా దానిని 3 సంవత్సరాలకు పెంచారు.
- ✔ జగనన్న హౌసింగ్ స్కీములో దివ్యాంగులకు ప్రాధాన్యత
- ✔ గతంలో పర్సంటేజీని బట్టి పింఛను ఉండేది. ఇప్పుడు అందరికీ కనీసంగా మూడు వేల రూపాయలు ఇస్తున్నారు.
- ✔ పక్ష వాతం ఉన్న దివ్యాంగులకు రూ. 5 వేలు
- ✔ పూర్తిగా మంచానికే పరిమితమైతే రూ. 10 వేలు పింఛను ఇస్తున్నారు.
- ✔ అర్హులైన దివ్యాంగులకు సబ్సిడీపై రుణాలు ఇస్తున్నారు.

నాలుగున్నరేళ్లలో దివ్యాంగులకు అందిన ఫలాలు..

ఉపకరణాలు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.
3 చక్రాల మోటార్ వాహనాలు	80	96,00000
ట్రై సెకిళ్లు	548	35,62000
బ్యాటరీ ట్రై సెకిళు	72	33,84,000
ల్యాప్ ట్యాబ్స్	336	1,17,60,000
టచ్ ఫోన్స్	387	58,05,000
బ్లయిండ్ స్టిక్స్	131	26,200
హియరింగ్ మిషన్	10	2,500
వాకింక్ స్టిక్స్	200	33,600
వీల్‌చైర్స్	135	1,08,000
	1899	2,84,76,300

జగనన్న ప్రభుత్వం చేయూత



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులను సకలాంగులు వివాహం చేసుకుంటే మ్యారేజ్ ఇన్సెంటివ్ అవార్డు కింద గతంలో ఉన్న లక్ష రూపాయలను జగనన్న ప్రభుత్వం 1.50 లక్షలకు పెంచటం ద్వారా వివాహాలు జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజునే వికలాంగులందరికీ సమాన పింఛన్ రూ. 3 వేలకు పెంచారు.

– డి.గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, మార్కాపురం.

దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 2,93,046 మంది పింఛను లబ్ధిదారులకు ఈనెలలో 81.48 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 5వ తేదీ లోపు అందిస్తాం.

– రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నాను



ఇతరులపై ఆధారపడకుండా ప్రభుత్వం సమకూర్చిన త్రిచక్రమోటార్ వాహనంతో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నా. ప్రభుత్వం దివ్యాంగులకు క్రమం తప్పకుండా పింఛన్ అందించటం, ఇతర సౌకర్యాలు కూడా పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

– బాపట్ల రేఖ, ఒంగోలు

బాక్ లాగ్ పోస్టుల భర్తీ



జిల్లాలో 32 బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేశాం. మరో 8 పోస్టులు దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భర్తీ చేస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా తిన చర్యలు తీసుకుంటున్నాం.

– జి అర్చన, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, ఒంగోలు

బుల్లెట్‌ను ఢీకొన్న కారు

- చిన్నారి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు


రుత్విక్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సింగరాయకొండ: రోడ్డు దాటుతున్న బుల్లెట్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో చిన్నారి రుత్విక్ (3) మృతిచెందగా, తల్లిదండ్రులు మల్లెబోయిన మనోజ్, శ్రీలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఉదయం 10 గంటల సమయంలో సింగరాయకొండ మండల పరిధిలోని జాతీయరహదారిపై విమానాల రన్‌వేపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మూలగుంటపాడులో నివసిస్తున్న మల్లెబోయిన మనోజ్ కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్లలో తన బంధువు పెళ్లిచూపులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బుల్లెట్‌పై భార్య శ్రీలక్ష్మి, కుమారుడు రుత్విక్‌తో కలిసి వస్తున్నాడు. మూలగుంటపాడు రోడ్డులోకి వెళ్లేందుకు విమానాల రన్‌వే దాటుతుండగా నెల్లూరు వైపు వెళ్తూ అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న సిమెంటు దిమ్మెను, ఆ తర్వాత బుల్లెట్‌ను ఢీకొట్టింది. బుల్లెట్‌ను కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో మనోజ్ తలకు తీవ్రగాయమై రెండు కాళ్లు విరిగాయి. అతని భార్య శ్రీలక్ష్మికి కూడా తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు రుత్విక్ ఘటన స్థలంలోనే మరణించాడు. మనోజ్, శ్రీలక్ష్మిలను ఆటోలో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి బంధువులు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు.


సంఘటన స్థలంలో కారు, బుల్లెట్

తుఫాన్‌తో ప్రాణనష్టం జరగకూడదు

- ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి


తుఫాన్ చర్యలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్‌తో ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శనివారం కోస్తా జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వివరించారు. పాఠశాలలకు ఈ నెల 4, 5 తేదీల్లో సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. రైతులు, మత్స్యకారులకు తగిన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోలు కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్, రవాణాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డీపీఓ నారాయణరెడ్డి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, డీటీసీ సుశీల, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్, ఆర్అండ్‌బీ దేవానందం, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, విపత్తు శాఖ డీపీఎం మాధురి, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డీడీ కాలేషా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ పర్యవేక్షణపై కమిటీల ఏర్పాటు : డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: తుఫాన్ వలన భారీ వర్షాలకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేసేందుకు జిల్లాలో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. కమిటీలో సర్పంచ్ అధ్యక్షునిగా, ఆరోగ్య, అంగన్‌వాడీ, ప్రభుత్వేతర సంస్థ, సలహా కమిటీలు, పంచాయతీ కార్యదర్శులు మెంబర్లుగా ఉండేలా చూడాలని మండల పరిషత్ అధికారులు, ఈఓపీఆర్డీలను ఆదేశించారు. ప్రత్యేకించి ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలంలో తప్పకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సర్క్యులర్ జారీ చేశారు. గ్రామ పంచాయతీలలో ఎప్పటికప్పుడు భారీ వర్షాలు, తుఫాన్లపై చాటింపు వెయ్యాలని, వలంటీర్ ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చే విధంగా తగిన సూచనలు చెయ్యాలని కోరారు. ప్రతి ఇంటికి క్లోరినేషన్ మాత్రలు పంపిణీ చేయాలని, బ్లీచింగ్, ఫినాయిల్ వంటి సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీపీఓ హెచ్చరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

పొదిలి రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన కర్నూలు–ఒంగోలు రహదారిపై పొదిలి మండలంలోని కంభాలపాడు–పోతవరం మధ్యలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతునిపాడు మండలం గుడిపాటిపల్లికి చెందిన జక్కుల శివయ్య (20) అలియాస్ శివనాగరాజు చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెంలో గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్నాడు. అతని పెదనాన్న బాలకృష్ణతో కలిసి తర్లుపాడు మండలంలోని రోలుగుంపాడుకు పని మీద శివయ్య ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పని ముగించుకుని బాలకృష్ణను అక్కడే వదిలి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన శివయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతిచెందిన శివయ్య

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతుడు వెంకటరెడ్డి


గాయపడిన చేతన్‌మాలిక్


దెబ్బతిన్న బైక్

కొనకనమిట్ల: బైక్ ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన 565వ నంబర్ జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లి వద్ద శనివారం చోటుచేసుకుంది. నాగిరెడ్డిపల్లికి చెందిన బైరెడ్డి వెంకటరెడ్డి (59) తన టీవీఎస్ మోటార్ సైకిల్‌పై పొలం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోకి వెళ్లే క్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన చేతన్ మాలిక్ తీర్థయాత్రల నిమిత్తం బైక్‌పై శ్రీశైలం వెళ్లి తిరిగి నెల్లూరు వెళ్తూ ప్రమాదవశాత్తూ వెంకటరెడ్డిని ఢీకొట్టాడు. ఎగిరి కిందపడిన వెంకటరెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న చేతన్ మాలిక్ కూడా గాయపడ్డాడు. అతన్ని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని కొనకనమిట్ల పోలీసులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం వెంకటరెడ్డి మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య శేషమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పొలం వెళ్లి వస్తూ కొద్దిక్షణాల్లో ఇంటికి చేరతాడనగా, రోడ్డు ప్రమాదంలో వెంకటరెడ్డి మృతి చెందడంతో భార్య శేషమ్మ, బంధువులు భోరున విలపించారు.

చిన్నారి కోసం ముమ్మరంగా దర్యాప్తు

- ఎస్పీ మలికాగర్గ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: చిన్నారి నిరీక్షణ అపహరణ కేసును చాలెంజ్‌గా తీసుకుని అన్ని కోణాల్లో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు ప్రత్యేక బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తు బృందానికి పలు సూచనలు చేశారు. చిన్నారి అపహరణ జరిగిన తీరుపై చర్చించిన ఎస్పీ.. జిల్లాలో ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్తులను విచారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. చిన్నారి అపహరణకు గురైన సమయంలో ఆ మార్గం గుండా ఇతర మార్గాలకు వెళ్లిన వాహనాల రాకపోకలపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైతే సాంకేతిక నిపుణుల సహాయం కూడా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా హాస్పిటళ్లు, గ్రామాల్లో కూడా విస్తృతంగా తనిఖీలు చేయాలని, చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదించాలని, చిన్నారిని గుర్తించి కాపాడటమే కాకుండా నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఓట్ల నమోదుపై దృష్టి సారించండి

ఉలవపాడు: 18, 19 సంవత్సరాలు నిండిన విద్యార్థుల ఓట్లపై ప్రధానంగా దృష్టి సారించి వారిని ఓటర్లుగా నమోదు చేయాలని జిల్లా చీఫ్ ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. ఉలవపాడులోని హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి విద్యార్థికి ఓటు హక్కు కల్పించాలన్నారు. వలస ఓటర్లకు ఇక్కడ ఓటు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇక్కడ నివాసం ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉండాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా, యువకుడు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయి

జే పంగులూరు: డ్రైవర్ మద్యం తాగి ట్రాక్టర్ నడపడంతో బోల్తాపడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ముచ్చు వెంకటేశ్వర్లు కుమారుడు ముచ్చు సాయి (20) గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ చేసిన సాయి శనివారం ఉదయం అలవలపాడు వెళ్లేందుకు సుబాబుల్ పొట్టు కోసం వెళ్తున్న ట్రాక్టర్ ఎక్కాడు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి ఉండటంతో ట్రాక్టర్ అదుపులో లేకుండా నడుపుతున్నాడు. ట్రాక్టర్ ఫ్లైఓవర్ దాటి సర్వీస్ రోడ్లోకి వెళ్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఇది గమనించిన సాయి ముందుగానే ట్రాక్టర్ నుంచి కిందకి దూకాడు. కిందపడిన సాయి మీదుగా ట్రాక్టర్ ట్రాలీ వెళ్లడంతో సాయికి కనపడని గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొరిశపాడు 108 సిబ్బంది క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తీసుకుపోగా, డాక్టర్ల సూచన మేరకు ఒంగోలులోని వెంకటరమణ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ సాయి మరణించాడు. మృతుడికి వివాహం కాలేదు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.